క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



షేక్ అఫ్రీద్ బాషా

కర్నూలు (టౌన్): గత డిసెంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన కర్నూలు క్రీడాకారుడు షేక్ అఫ్రీద్ బాషాకు ఆంధ్రప్రదేశ్ జట్టులో చోటు లభించింది. ఆటను ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని బావ్‌నగర్‌లో నిర్వహించనున్న 74వ సీనియర్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. కర్నూలు నుంచి సీనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, అసోసియేషన్ అధ్యక్షులు నీలిమ, బానుప్రసాద్ నాయకులు దా దాబాషా అభినందించారు. అఫ్రీద్ బాషా ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో రాష్ట్ర జట్టు తరఫున శిక్షణ శిబిరంలో ఉన్నట్లు వారు వెల్లడించారు.

7న సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఆలూరు పట్టణంలోని కేవీకే ఇండోర్ స్టేడియంలో ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు సెపక్‌తక్రా క్రీడాంశంలో జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సెపక్‌తక్రా జిల్లా సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 2005 జనవరి 1వ తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 17, 18 తేదీల్లో ప్రకాశం జిల్లా పొదిలిలో నిర్వహించనున్న 28వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 94402–57242 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉస్మానియా పూర్వ విద్యార్థికి సన్మానం



ఎన్‌సీజీ బ్లాక్ క్యాట్ కమాండో సర్టిఫికెట్ పొందిన నరేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: ఉస్మానియా కాలేజీలో చదువుతూ భారత సైన్యంలో చేరాలనే లక్ష్యంతో ఎన్‌సీసీ శిక్షణ పొంది, ఆ తర్వాత దేశంలోనే అతి కఠినమైన శిక్షణ పొంది ఎన్.ఎస్.జీ బ్లాక్ క్యాట్ కమాండో సర్టిఫికెట్ పొందిన పూర్వ విద్యార్థి ఎద్దుల నరేష్‌ను ఘనంగా సన్మానించారు. గురువారం ఆ కాలేజీ ప్లేస్‌మెంట్ సెల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్‌స్పాండెంట్ అజ్రా జావెద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశానికి ఓ సైనికుడిని ఇచ్చిన నరేష్ తల్లిదండ్రుల జీవితం ధన్యమైందన్నారు. ప్రిన్సిపాల్ సయ్యద్ నవీఉద్దీన్ మున్సిపల్ మాట్లాడారు. అధ్యాపకులు డా.మండి అన్సర్ హుసేన్, వివిధ శాఖల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

కర్నూలు సిటీ: ఎమ్మిగనూరు సమీపంలోని బనవాసి గురుకుల జూనియర్ కాలేజీలో విద్యార్థినిని వేధింపులకు గురి చేసిన ట్రైనీ ఐపీఎస్ కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం కన్వీనర్ కె.సంధ్యశ్రీ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, అలాంటి వాటిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. మహర్దశకుడిగా ఉండాల్సిన లైబ్రేరియన్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం బాధాకరమని, ఇందుకు సహకరించిన ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయురాలిని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతూ మహిళా హోంమంత్రి, డిప్యూటీ సీఎం ప్రకటనలకే పరిమితమయ్యారని, ఆచరణలో మాత్రం విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ దేశాలు మెచ్చిన నాయకుడు మన్మోహన్‌సింగ్ అని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం డీసీసీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ సంతాప సభను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు అన్నారు. ఆర్థిక సంస్కరణలకు మన్మోహన్‌సింగ్ ఆద్యుడన్నారు. అనంతరం మౌనం పాటించి కాంగ్రెస్ కమిటీ తరఫున సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుధాకరబాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా, నాయకులు దామోదరం రాధాకృష్ణ, వెంకటరెడ్డి, బజారన్న, రియాజుద్దీన్ పాల్గొన్నారు.



ఉద్యోగులకు ఝలక్

కలెక్టరేట్ ఉద్యోగులకు పోలీసులు ఝలక్ ఇచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ వర్గీకరణపై వినతుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో ఉద్యోగుల వాహనాలన్నీ మెయిన్ గేటు బయటనే పార్కింగ్ చేయించారు. అయితే కొద్ది సేపటి తరువాత ట్రాఫిక్ పోలీసులు వచ్చి వాహనాలను వ్యాన్‌లో స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఉద్యోగులు అవాక్కయ్యారు. చివరికి తప్పనిసరిపరిస్థితుల్లో ఉద్యోగులు స్టేషన్‌కు వెళ్లి వాహనాలను తెచ్చుకున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, కర్నూలు



కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్దనే వాహనాన్ని పార్క్ చేయిస్తున్న పోలీసులు

బాలల ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి



బాలుడి ఎత్తు కొలుస్తున్న వైద్య సిబ్బంది, చిత్రంలో ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): నేటి బాలలే రేపటి పౌరులని, వారు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్‌లో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారి హేమలత చెప్పారు. గురువారం స్థానిక ఎన్‌టీఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో జరుగుతున్న నాలుగు రకాల వ్యాధుల స్క్రీనింగ్ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. పిల్లల్లో కనిపించే స్వల్ప అనారోగ్య లక్షణాలు దీర్ఘకాలిక వ్యాధులుగా మారకుండా ఆరోగ్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు, సలహాలు ఇస్తున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రులకు తరలిస్తామన్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రహణమొర్రి, పెదవి చీలిక, వంకర పాదాలు, నడుము భాగము వృద్ధి లోపం, సంక్రమిక కంటి పొర, గుండె జబ్బులు, పుట్టుకతో వచ్చే చెవుడు, రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ, రక్తహీనత, విటమిన్ల లోపం, మేధోపరమైన అసమానత,వయస్సుకు అనుగుణంగా మాటలు రాకపోవడం, ఆటిజం, అభ్యసన సమస్యలు, తలసీమియా, డౌన్ సిండ్రోమ్, న్యూరల్ ట్యూబ్ లోపం సహా 30 రకాల ఆరోగ్య సమస్యలు, లోపాలు గుర్తించేందుకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీరాములు, హెడ్‌నర్స్ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీఓ నేతకు సత్కారం



వీసీహెచ్ వెంగళ్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డిని వివిధ సంఘాల నేతలు సత్కరించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ఆయనకు అభినందనలు తెలపడంతో పాటు సత్కరించారు. నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంపీ కాశన్న, రామకృష్ణ, రాష్ట్ర ట్రెజరర్, స్టెనో (గ్రాఫర్స్) అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిప్రకాశ్ రావు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం నేతలు తదితరులు ఎన్‌జీఓ నేతను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 విభాగంలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా అథ్లెట్లు సత్తా చాటాలని జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యదర్శి ఎస్.హరిప్రసాద్ సూచించారు. గురువారం జాతీయ పోటీల్లో పాల్గొనే అథ్లెట్లను డీవీఈఓ వై.వరమేశ్వర రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బాలుర విభాగంలో ఎస్.మహేంద్ర, ఆర్.వినోద్‌కుమార్, కె.హిమేష్, రోహిత్ రెడ్డి, బి.వరకుమారుడు, ఎస్.వెంకటేష్, బిజి.శివప్రసాద్, ఏ.మహేష్ కుమార్, బాలికల విభాగంలో ఆర్.సాయిప్రియ, ఎస్.మహాలక్ష్మి, బి.శ్రీస్ర, సి.శ్రీప్రియ, జి.అర్చన, కె.సాయి నవ్యశ్రీ పాల్గొననున్నట్లు వెల్లడించారు.

అలరించిన ‘చిగురు మేఘం’



చిగురు మేఘం నాటికలో సన్నివేశ దృశ్యం



సినీ నటుడు గోపరాజు రమణను సన్మానిస్తున్న ఎంపీ నాగరాజు, కళాకారులు

కర్నూలు కల్చరల్: సీఆర్‌ఎస్ టీజీవీ కళాక్షేత్రంలో హైదరాబాద్ మహతి క్రియేషన్స్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో నిర్వహిస్తున్న సాంఘిక నాటకోత్సవాల్లో భాగంగా గురువారం రెండవ నాటికను ప్రదర్శించారు. అనంతరం గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారిచే కావూరి సత్యనారాయణ రచనలో పప్పూరి హరిబాబు దర్శకత్వం వహించిన ‘చిగురు మేఘం’, గుంటూరు అభినయ ఆర్ట్స్ వారిచే స్నిగ్ధ రచించి రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించిన ‘ఇది ఐతిహ సహజం’ నాటికలు ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ నాగరాజు మాట్లాడుతూ.. కర్నూలులో మూడు రోజుల పాటు కళాకారులు అద్భుతమైన నాటికలను ప్రదర్శించడం సంతోషదాయకమన్నారు. నాటకం సజీవమైందని దాన్ని జీవింపజేయాల్సిన అవసరం కళాకారులు, ప్రేక్షకులకు ఉందన్నారు. కళాకారులకు తన వంతు చేయూతను అందిస్తానన్నారు. కళా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి సన్మానంలో భాగంగా సినీ, టీవీ నటులు గోపరాజు రమణను అతిథులు ఘనంగా సన్మానించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సినీ నటులు సుబ్బరాయ శర్మ, గోపరాజు రమణ మాట్లాడారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, ఉపాధ్యక్షులు సీవీ రెడ్డి, సభ్యులు ఐనాయతుల్లా, ఈశ్వరయ్య, యాగంటీశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, రాముడు, గాండ్ల లక్ష్మన్న, రాజారత్నం, క్రిస్టఫర్, తదితరులు పాల్గొన్నారు.

ఈగల్ 360 నిఘా



కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఈగల్–360 కెమెరా దృశ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పైలట్ ప్రాజెక్టు కింద వినాయక ఘాట్ దగ్గర ఏర్పాటు చేసిన ఈగల్ 360 కెమెరా పనితీరును కలెక్టర్ పి.రంజిత్‌బాషా పరిశీలించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆ కెమెరా పనితీరుపై మునిసిపల్ కమిషనర్‌తోపాటు పరిశీలన చేశారు. ఈ సర్వేలెన్స్ కెమెరా ద్వారా కెనాల్‌లో ఉన్న నీటి ప్రవాహం, ఆ ప్రాంతంలో ఉన్న వాహనాల రాకపోకలు, ఇతర దేనినైనా చాలా స్పష్టంగా తెలుసుకొనేందుకు వీలు ఉంటుంది. ఈ కెమెరా పనితీరుపై సంతృప్తి చెందితే నగరంలో ఇలాంటి కెమెరాలను మరికొన్నింటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.



ఈగల్–360లో నమోదైన వినాయక ఘాట్ దృశ్యం

సంక్రాంతి ముగ్గుల పోటీలు

కర్నూలు(సెంట్రల్): ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి తెలిపారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముగ్గుల పోటీల వివరాలను తెలియజేశారు. జనవరి 11, 12 తేదీల్లో ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులను అందించనున్నట్లు వెల్లడించారు.

నర్సుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, నర్సులు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సింగ్ సూపరింటెండెంట్లు సావిత్రిబాయి, విమలమ్మ, అసోసియేషన్ ప్రెసిడెంట్ లీలావతి, ఉపాధ్యక్షురాలు కాంతి భవాని, సెక్రటరీ బంగారి, ట్రెజరర్ లక్ష్మీనరసమ్మ, ఈసీ మెంబర్లు సోమేశ్వరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు



కేక్ కట్ చేస్తున్న కర్నూలు నగర కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు గురువారం పలువురు నగరపాలక ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషనర్ నగ్మాభంలో ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఆర్‌ఓ ఇక్బాల్‌యలు, సూపరింటెండెంట్లు రామకృష్ణ, వాజిద్, శ్రీకాంత్, ఖలీల్ ఉర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయాలి



ఐసీడీఎస్ పీడీ నిర్మలకు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు న్యూసిటీ: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులను వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, అంగన్‌వాడీ కార్మిక సంఘం నాయకులు సంధ్యారాణి, సుజాత కోరారు. నూతనంగా జిల్లాకు వచ్చిన ఐసీడీఎస్ పీడీ నిర్మలను గురువారం ఆమె కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు, కేంద్రాల సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించాలని కోరారు.

కందిపప్పు, జొన్నలు అందరికీ ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎండీయూ వాహనాల ద్వారా జొన్నలు, చక్కెర, కందిపప్పు సరఫరా చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆదేశ వ్యక్తం చేశారు. గురువారం ఇందిరాగాంధీ నగర్‌లో ఎండీయూ వాహనంలో సరఫరా చేసిన సరుకుల్లో బియ్యం తప్పా ఇతర సరుకులు లేవన్నారు. ఆదివారే స్టాక్ లేదని చెబుతూ తప్పించుకుంటున్నారని, ప్రతి రేషన్‌కార్డుదారుడికి అర కేజీ చక్కెర, కేజీ జొన్నలు, కేజీ బ్యాక్లు ఇవ్వలేదని ప్రశ్నించారు. అందరికీ అన్ని రకాల సరుకులను సరఫరా చేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

పెద్దాసుపత్రి రూపురేఖలు మారుస్తా

- శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్‌పై ప్రత్యేక దృష్టి
- వైద్యులు, సిబ్బంది హాజరుపై నిఘా
- హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రూపురేఖలు మార్చేందుకు తన వద్ద ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి. సింధు సుబ్రహ్మణ్యం చెప్పారు. ఆమె గురువారం ‘సాక్షి’తో మాట్లాడుతూ దివంగత ఐఏఎస్ పి.సుబ్రహ్మణ్యం కుమార్తెనైన తన స్వస్థలం నెల్లూరు అని చెప్పారు. తండ్రి సుబ్రహ్మణ్యం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో ప్రయాణిస్తూ హెలికాప్టర్ ప్రమాదంలో 2009 సెప్టెంబర్ 2న మరణించారన్నారు. గత ప్రభుత్వం 2019లో తనకు డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చిందని చెప్పారు. కోనసీమ జిల్లా అమలాపురం ఆర్‌డీఓగా కొంత కాలం పనిచేశానని, పుర్తిగా రెవెన్యూ శాఖలో ఉన్న తనకు ఇప్పుడు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించడం కొత్తగా ఉందన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న సమస్యలు, సవాళ్లు అన్నీ తెలుసుకుంటున్నానని చెప్పారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, పెస్ట్‌కంట్రోల్‌ను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు సదరు ఏజెన్సీల నిర్వాహకులు, వర్కర్స్‌తో సమావేశమవుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రి బ్లూ ప్రింట్ తీసుకుని ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నాయి, వాటిని ఎప్పుడు, ఎలా పరిష్కరించాలన్న ప్రణాళిక రూపొందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే కొన్ని సమస్యలు గుర్తించామని, అంచెలంచెలుగా వాటిని పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో ఆసుపత్రిలోనే ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు నూతన సంవత్సర కానుక



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: నూతన సంవత్సర కానుకగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు చెబుతూ అందించిన పుస్తకాలు, పెన్నులు, విద్యా సామగ్రిని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారు పూలమాలలు, బొకేలు, శాలువాలకు బదులుగా విద్యార్థులకు ఉపయోగపడేలా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటివి తీసుకురావాలని కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. దీంతో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు చెప్పడంతో పాటు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని అందించారు. పెద్ద ఎత్తున పోగైన విద్యా సామగ్రిని గురువారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ ఎంత వరకు పూర్తయ్యిందని అడిగారు. అలాగే పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు తిరుమలేష్ గౌడ్, తిరుపాల్, ప్రధానోపాధ్యాయులు హుస్సేన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆర్.ప్రశాంత్, ఉపాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, ఆరోయా విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు



పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా తదితరులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్, ఆ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మణిరెడ్డి ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులను ఆయన అభినందించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి షరీఫ్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు, కిషన్, సలీమ్, బాషా, లాజర్, వరుణం, వసీమ్, శ్రీకాంత్, ఆనంద్ రెడ్డి, తిమ్మప్ప, బండిమెట్ల మధు, ఆరోయా విద్యార్థి విభాగం నాయకులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఎస్వీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు సిటీ: పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్ డైరీని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా గురువారం కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసి స్కూళ్లకు అందజేశామని, ఆ ప్రకారం విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడిన పిల్లలపై టీచర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధి మూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీ కృష్ణారెడ్డి, ఎం.ఆనందప్ప, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

కోడుమూరు రూరల్: ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ గురువారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన వలంటీర్లు గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ శరత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు కుమార్, ఆనంత్‌కుమార్, హమీద్, రాజశేఖర్, మాధవలక్ష్మి, గిరిజ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, గౌరవ వేతనంగా రూ.10 వేలు చెల్లిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకొచ్చిన 7 నెలలు గడుస్తున్నా హామీలను నెరవేర్చలేదని వాపోయారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీ మేరకు క్యాబినెట్ సమావేశంలో వలంటీర్లకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవడంతో పాటు, 7 నెలల గౌరవ వేతన బకాయిలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.